

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

సోమవారం

16 నవంబర్ 2026



ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులకు మరో అవకాశం

- **అర్హులైన వారు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల నడిగడ్డ, నవంబర్ 15 (జనంసాక్షి); ఎస్ఐఆర్-2026లో ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేని అర్హులకు నవంబర్ 21లోగా ఫారాలు సమర్పించి పేరు నమోదు చేసుకునేందుకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

భారత ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాల మేరకు గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలోని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు సంబంధిత పోలింగ్ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థల కార్యాలయాల్లో తిరిగి ప్రదర్శించే ఏఎస్ డిడి జాబితాల్లో ఓటర్లు తమ పేర్లను పరిశీలించుకోవాలని తెలిపారు. ఈ జాబితాలు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

నివాసం మార్చని ఓటర్లు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారంతో పాటు గతంలో ఫారం సమర్పించలేకపోయిన కారణాలను వివరిస్తూ అనుబంధం-బి సమర్పించాలని సూచించారు. నివాసం మార్చిన వారు కొత్త చిరునామా, సంబంధిత నియోజకవర్గ వివరాలతో కూడిన అనుబంధం-సి, చిరునామా ధ్రువీకరణ పత్రాలతో పాటు ఎన్యుమరేషన్ ఫారాన్ని ప్రస్తుతం నివసిస్తున్న నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారికి అందజేయవచ్చని తెలిపారు. రాష్ట్ర పరిధిలోనే నివాసం మార్చిన వారికి ఈ ప్రత్యేక ప్రక్రియలో ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. చిరునామా ధ్రువీకరణ పత్రాలు లేని నిరాశ్రయుల విషయంలో సంబంధిత బూత్ స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో నిర్వహించే పరిశీలన నివేదికను నివాస ధ్రువీకరణగా పరిగణిస్తారని తెలిపారు.

గతంలో కేటాయించిన ఓటరు గుర్తింపు కార్డు నంబరు ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ లేదా ఈసీఐనెట్ యాప్ ద్వారా ఎన్యుమరేషన్ ఫారాన్ని పొందడంతో పాటు, ఆన్‌లైన్‌లో సమర్పించే సదుపాయం కూడా కల్పించారని వివరించారు. ఇప్పటికే కొత్త ఓటరు నమోదుకు ఫారం-6 సమర్పించిన వారు తిరిగి ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని తెలిపారు. అందిన దరఖాస్తులను సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు పరిశీలించి, అర్హత మరియు సాధారణ నివాస వివరాలను ధ్రువీకరించిన అనంతరం అర్హులైన వారి పేర్లను తుది ఓటర్ల జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. అర్హత పొందిన వారికి గతంలో కేటాయించిన ఓటరు గుర్తింపు కార్డు నంబరునే తిరిగి కేటాయిస్తారని తెలిపారు.ఈ ప్రక్రియను నవంబర్ 21వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉన్నందున సంబంధిత బూత్ స్థాయి అధికారులు అర్హులైన ఓటర్లను సంప్రదించి అవసరమైన సహకారం అందించాలని, ఓటర్లు కూడా ఆలస్యం చేయకుండా తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులను సంప్రదించి ఫారాలు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలు, సహాయం కోసం సంబంధిత బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించవచ్చని లేదా 1950 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయవచ్చని తెలిపారు.

అనర్హుల ఓటు హక్కును తొలగించి పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడమే ధ్యేయంగా భారత ఎన్నికల సంఘం ఓటర్ జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ వంతుగా సహకారం అందించి అర్హులైన ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గడువు ముగిసిన తర్వాత తుది జాబితాలో తమ పేరు లేదని ఆందోళనకు గురికాకుండా ముందస్తుగానే తగు జాగ్రత్త వహించాలన్నారు.

అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ఎన్నికల సంఘం అందించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తుది ఓటర్ల జాబితాలో తమ పేరు ఉండేలా చూసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు.





పోచమ్మ ఆలయ శిలాఫలకాల ధ్వంసం

- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.. మాజీ ప్రజాప్రతినిధుల డిమాండ్**

కల్వకుర్తి, నవంబర్ 15 (జనంసాక్షి): నాగర్ కర్నూలు జిల్లాకల్వకుర్తి మండలంజిల్లెల్లగ్రామ శివారులోని దేవి చెరువు సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవి ఆలయంలో శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య, మాజీ ఉపసర్పంచ్ పి.పాండు గౌడ్ డిమాండ్ చేశారు.

ఆదివారం వారు మాట్లాడుతూ.. సుమారు రూ.35 లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు.నిర్మాణానికి సహకరించిన జిల్లెల్ల,యంగంపల్లి గ్రామాల దాతలతో పాటు పలువురి పేర్లను శిలాఫలకాలపై పొందుపరిచినట్లు పేర్కొన్నారు.ఆలయంలో మొత్తం నాలుగు శిలాఫలకాలు ఉండగా, గుర్తుతెలియని వ్యక్తులు రెండు పలకలను తొలగించి బయట పడేసి ధ్వంసం చేశారని తెలిపారు. ఉద్దేశ పూర్వకంగానే ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ శిలాఫలకాలను ధ్వంసం చేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని వారు పేర్కొన్నారు.

కార్తీకం..శుభకరం..!



- **మాసాలన్నిటిలో మహోన్నతమైనది కార్తీకం**
- **భ్రమరాంబ సహిత శంభులింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాలు**
- **కార్తీక పౌర్ణమికి భారీగా హాజరుకానున్న భక్తులు**







సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 15 (జనంసాక్షి):

విష్ణుమూర్తితో సమానమైన దేవుడులేడు. గంగతో సమానమైన తీర్థంలేదు. కార్తీక మాసంతో సమానమైన మాసం లేదు. తెల్లవారుజామునే నిద్ర లేవడం, ప్రవహిస్తున్న నీటిలో స్నానాలు చేయడం, భోళాశంకరుడికి నిత్యం రుద్రాభిషేకం చేయడం, నుదుటన విభూది పెట్టుకోవడం, మెడలో రుద్రాక్ష లేదా తులసిమాలను ధరించడం, రోజూ ఒకపూట మాత్రమే భుజించడం, ఉసిరి చెట్టునీడలో వనభోజనాలు చేయడం... ఒకటేమిటి ఎన్నో సంప్రదాయాలు, ప్రత్యేకతలు కార్తీక మాసంలో కొనసాగుతాయి. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆయా ఆలయాల్లో కార్తీక మాస ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉదయం సాయంత్రం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే కార్తీక మాసం సందర్భంగా దీపాలు వెలిగిస్తున్నారు.

దీపారాధన.....

కార్తీకమాసంలో దీపారాధన చేయడం మహామహి మోపేతమైనది. శివాలయంలో లేదా గృహంలోనైనా సరే ప్రాతఃకాలం, సాయంకాలంలో దీపారాధన చేస్తే దైవానుగ్రహం లభిస్తుంది. ఎవరైనాసరే కార్తీకమాసంలో తెలిసి లేదా తెలియకుండా ఎక్కడైనా దీపం పెడితే వారి సర్వవిధ పాపాలు హరిస్తాయని పురాణాల కథనం. కార్తీక దీపదానం వల్ల నరకప్రాప్తి నివారణ కలుగుతుంది. ఈ మాసంలో దీపారాధన స్త్రీలకు విశేష ఫలప్రదం. దీపం, బంగారం, నవధాన్యాలు, అన్నం, మంచం వంటి వాటిలో దేనిని దానం చేసిన స్త్రీలకు ఐదోతనం బలంగా వుంటుంది. సూర్యాస్తమయం అయిన వెంటనే సంధ్యదీపం వెలిగించడం, వాకిట్లో ముగ్గు, గుమ్మం ముందు లేదా తులసి కోటలో దీపం పెట్టడం, తులసి పూజ లేదా గౌరీ పూజ చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి.

ధాత్రి పూజ.....

ధాత్రి అంటే ఉసిరిక. ఉసిరిక లక్ష్మీదేవికి ఎంతో ఇష్టమైనది. కార్తీకమాసంలో ఉసిరిక వృక్షం కింద భోజనం చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుంది. ఉసిరిక వృక్షం మొదట్లో ధాత్రి దేవిని, దామోదరుడిని పూజించి మధుర పదార్థాలను నివేదించాలి. బంధుమిత్రులతో కలిసి ఉసిరికి చెట్టు ఉన్న వనంలో భోజనం చేయడం అనేది వనభోజనాలుగా ప్రసిద్ధి.

ఆకాశదీపం....

శివ కేశవులకు కార్తీకమాసం ఎంతో ప్రీతికరమైనది. ఈ మాసం ప్రారంభం కాగానే దేవాలయాల్లో ధ్వజస్తంభానికి ఆకాశదీపాన్ని వేలాడదీస్తుంటారు. చిన్న చిన్న రంధ్రాలున్న గుండ్రని ఇత్తడి పాత్రలో నూనె పోసి ఈ దీపాన్ని వెలిగిస్తారు. తాడు సహాయంతో ఈ పాత్రను పైకి పంపించి, ధ్వజ స్తంభంపైభాగాన వేలాడదీస్తారు. ఈ దీపంలో నూనె పోయడానికి, దీపాన్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుంటారు. ఈ దీపంతో పితృదేవతలు సంతృప్తి చెందుతారని పురాణాల్లో ఉంది.

శంభులింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి....

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో గల శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సహిత శంభులింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో నిత్యం మహిళా భక్తుల సందడి నెలకొంది. అదెల్లి నారాయణ నిర్మించిన శ్రీ భ్రమరాంబా సహిత శంభు లింగేశ్వర ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ భక్తులతో కిటకిటలాడుతుంది. ఆలయానికి వచ్చి శంభు లింగేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులకు కోరికలు నెరవేరుతాయని ప్రగాఢ నమ్మకం ఉంది. శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సహిత శంభులింగేశ్వర స్వామి దేవస్థానము ధర్మకర్త శ్రీశ్రీశ్రీ శంభులింగేశ్వర స్వామి సేవా సమితి చైర్మన్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదెల్లి రవీందర్ ఆధ్వర్యంలో కార్తీకమాసం పురస్కరించుకొని నెల రోజులపాటు ఆలయ ప్రాంగణంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆదెల్లి రవీందర్ తెలిపారు. కార్తీక మాసం మొదటి రోజు ఆలయ ధర్మకర్త ఆదెల్లి రవీందర్-రుక్మిణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశ దీపాన్ని వెలిగించారు.

కార్తీక మాస విశేష పూజా కార్యక్రమాలు....

శ్రీ భ్రమరాంబ సహిత శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో డిసెంబర్ 7 వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రతిరోజూ స్వామి వారికి 5.30, 8.00, 10.30 అభిషేకాలు. స్వామివారికి విశేష రుద్రాభిషేకం, సాయంత్రం 7.00 గం.లకు దీపోత్సవం జరుగుతుంది. కార్తీక మాసం ప్రతిరోజూ సా. 6.00 గం.లకు ఆకాశదీప కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఆకాశదీప కార్యక్రమానికి బీరంగూడ భక్తులే కాకుండా అమీన్పూర్, రామచంద్రపురం, లింగంపల్లి తదితర పట్టణాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని ఆకాశ దీపాన్ని తిలకిస్తారు.

కార్తీక పౌర్ణమికి అన్ని ఏర్పాట్లు..... ఆలయ ధర్మకర్త ఆదెల్లి రవీందర్.....

ఈ నెల 24న కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఆలయంలో నిర్వహించనున్న కార్యక్రమాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయానికి వచ్చే భక్తులకు ఇలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. కార్తీక పౌర్ణమి రోజు భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని ఆ దిశగా ఏర్పాటు చేస్తున్నాం.

నేడే పింఛన్లు, రేషన్ కార్డులు, సీఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ

• వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి

శ్రీరంగాపురం, నవంబర్ 15(జనంసాక్షి): మండల కేంద్రంలోని శ్రీ రంగనాయక స్వామి ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు, పింఛన్, డిజిటల్ రేషన్ కార్డ్స్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ పంపిణీ చేస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు పెబ్బేరు మండల కేంద్రంలో వల్లపు రెడ్డి అనసూయమ్మ ఫంక్షన్ హాలులో ఆపోజిట్ సంత బజార్ పెబ్బేరు టౌన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు, పింఛన్, డిజిటల్ రేషన్‌కార్డ్స్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ పంపిణీ చేస్తారు.

మధ్యాహ్నం 3 గంటలకు వనపర్తి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు, పింఛన్, డిజిటల్ రేషన్ కార్డ్స్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ పంపిణీ చేస్తారు.



సాయంత్రం 5 గంటలకు వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్, రేషన్ కార్డులు, సిఎంఆర్ఎఫ్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

కావున ఇట్టి కార్యక్రమాలకు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు, మార్కెట్ యార్డు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పీసీసీ సభ్యులు, సింగిల్ విండో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, ఎన్ఎస్ యుఐ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు, హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని మనవి.

కరాటేతో శారీరక, మానసిక ప్రశాంతత

• మాస్టర్ సయ్యద్ ఇస్మాయిల్



మక్తల్, నవంబర్ 15 (జనంసాక్షి): కరాటేతో శారీరక మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాస్టర్ బుడోకాన్ కరాటే సంస్థ ఫౌండర్ మాస్టర్ సయ్యద్ ఇస్మాయిల్ తెలిపారు. ఆదివారం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, మెరూన్, బ్రౌన్ బెల్టులు తోపాటు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరాటేతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, కేవలం ఆత్మరక్షణకు మాత్రమే కాకుండా సత్సంబంధాలు పెంపొందించేందుకు దోహదం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ బుక్కా శంఖుద్దీన్, అశోక్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బాలరాజ్, హఫీజ్,మహమ్మద్ ఇస్మాయిల్, విశాల్, అహ్మద్ షా తదితరులు పాల్గొన్నారు.

మర్చిపోయిన సెల్‌ఫోన్‌ను
తిరిగి అందజేసిన ఆర్టీసీ సిబ్బంది



మల్దకల్, నవంబర్ 15(జనంసాక్షి): బస్సులో ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికురాలు తన సెల్‌ఫోన్‌ను బస్సులోనే మర్చిపోయారు. బస్సులో సెల్‌ఫోన్‌ను గుర్తించిన కండక్టర్ కిష్టన్న,డ్రైవర్ రాధాకృష్ణ వెంటనే స్పందించి,కంట్రోలర్ వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం సెల్‌ఫోన్‌ను సంబంధిత ప్రయాణికురాలికి అందజేశారు. ప్రయాణికుల పట్ల బాధ్యత, నిజాయితీతో వ్యవహరించిన కండక్టర్ కిష్టన్న,డ్రైవర్ రాధాకృష్ణనీ అభినందించారు. ప్రయాణికుల నమ్మకాన్ని నిలబెట్టే ఇలాంటి నిజాయితీ సేవలు ఆర్టీసీకి గర్వకారణం. తన సెల్ ఫోన్‌ను అందించినందుకు ప్రయాణికురాలు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహ వేడుకల కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దామోదర



రాయికోడు, నవంబర్ 15 (జనంసాక్షి): మండల పరిధిలోని సింగీతం గ్రామానికి చెందిన ఆర్ కిష్టయ్య రిటైర్డ్ టీచర్ కుమారుడు, మనోజ్-మనిషాల వివాహ వేడుకలు కార్యక్రమం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రముఖ న్యాయవాది జి అంజయ్య,లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి వారిని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో ఎంఆర్ఎఫ్ యూనియన్ ప్రెసిడెంట్ కొత్తకోళ్ల చంద్రశేఖర్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కేదార్నాథ్ పాటిల్, మాజీ అధ్యక్షులు బాలాజీ నర్సింలు, వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి,కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండి రఫీక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జి విట్టల్, మాజీ ఎంపీటీసీలు ఎన్ ఆగమయ్య ,గంజి విట్టల్,మాజీ సర్పంచ్ ఆర్ అంబన్న, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏ ప్రభాకర్, కురుమ సంఘం నాయకులు ఏ.ప్రభాకర్, నర్సింలు, రాజకుమార్, నాగయ్య, సర్పంచులు సంగమేశ్వర్ పాటిల్,ఏ నరేష్,ఆత్మ కమిటీ డైరెక్టర్ ఒగ్గు శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ లు కే పాండు, మనీల్ కుమార్, గాయత్రి నల్లోల దత్తాత్రేయ, కాంగ్రెస్ నాయకులు నజీర్, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

పోతారంలో బాలల దినోత్సవం



తూప్రాన్, నవంబర్ 15 (జనంసాక్షి): బాలల దినోత్సవం పురస్కరించుకొని పోతారం గ్రామ పంచాయతీలో బాల గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పుట్ట వినోదమహేందర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని బాలల చిరునవ్వులోనే దేశం అభివృద్ధి దాగి ఉందని బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరికి భాద్యత అని పేర్కొనడం జరిగింది,ఈ సందర్భంగా విద్యార్థులకు చాకోలెట్స్ మరియు బిస్కూట్ పాకెట్స్ పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మంద. యాదగిరి,మన్నే.సురేష్, చెలిమేల. పవన్ గౌడ్, సంకి. శ్రీకాంత్ సెక్రటరీ రజిత, ఉపాధ్యాయులు షర్మిల, అంగన్వాడీ టీచర్ తులసి,ఆశ వర్కర్ రత్న,గ్రామస్తులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ

• ధ్వజస్తంభం దేవాలయానికి నాభి వంటిది: వేద పండితులు

• భక్తులకు అన్నదానం చేసిన పబ్బా మహేశ్

శివ్వంపేట, నవంబర్ 15 (జనంసాక్షి):

మండల కేంద్రంలోని పురాతన కోదండ రామస్వామి దేవాలయంలో నూతన శిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం పూర్ణాహుతితో వైభవంగా ముగిశాయి. ఎన్నో ఏళ్లుగా ధూపదీప నైవేద్యాలకు నోచుకోని ఆలయానికి ఈ కార్యక్రమంతో పూర్వ వైభవం సంతరించుకుంది. రెండు రోజులపాటు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శనివారం పుణ్యాహవాచనం, గణపతి పూజ, దేవతా స్థాపనలు, హోమాలు, ధ్వజస్తంభానికి జలధివాసం, పుష్పాధివాసం, ధాన్యాధివాసం, శయ్యాధివాసం తదితర క్రతువులు నిర్వహించారు. ఆదివారం బలిప్రదానం, పూర్ణాహుతి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ఆశీర్వచనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ ధ్వజస్తంభం దేవాలయానికి నాభి వంటిదని, ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూర్తికావడం శుభసూచకమని పేర్కొన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ పబ్బ రమేష్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ పబ్బా మహేశ్ గుప్తా దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తమ శర్మ, వెంకటేశ్వర శర్మ, రాజశేఖర్ శర్మ, చంద్రశేఖర శర్మ తదితర వేద పండితులతో పాటు గ్రామస్థులు, అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ధ్వజస్తంభం
ఏర్పాటు కోసం 21 వేల ఆర్థిక సహాయం

• పులిమామిడి నవీన్ గుప్తా



శివ్వంపేట, నవంబర్ 15 (జనంసాక్షి): మండల కేంద్రమైన శివ్వంపేటలోని పురాతన సీతా, లక్ష్మణ సమేత కోదండరాముడి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ ప్రతిష్ఠ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా తన అనుచర గణాలతో హాజరై దేవాలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ఏర్పాటుకు తనవంతు సహాయంగా రూ. 21, 000, ఇరవై ఒక్క వేయి రూపాయలు పురోహితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వరాల గణేష్, షేక్ దావూద్, వార్డు సభ్యులు దేవుని బోయిన కృష్ణ, ఈసారపు రాజు గౌడ్, కోలా కిషన్, నాయకులు షేక్ అలీ, వజ్జ శ్రీనివాస్ స్వామి, కమలయ్య గారి వెంకటేష్, ప్రభులింగం, వర్రే మల్లేష్ యాదవ్, మెతుకు మల్లేష్, బాసంపల్లి నర్సింలు గౌడ్, కార్తీక్ యాదవ్, సంఘని భరత్, కొత్తపేట నిశాంత్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అందజేత



పాపన్నపేట, నవంబర్ 15 (జనంసాక్షి): పాపన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గత కొన్ని సంవత్సరాలుగా అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న కొమ్ము జయచందర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాద ఘటనతో మల్లంపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి పట్ల పీఏసిఎస్ పాలకవర్గం,సిబ్బంది తీవ్ర సంతాపం తెలిపారు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20,000 ఆర్థిక సాయం అందజేశారు. మల్లేశం, లక్ష్మీనారాయణ, మోహన్ రెడ్డి, పుష్పలత, లక్ష్మాగౌడ్, నాయకులు.. ప్రశాంత్ రెడ్డి, సర్పంచ్ పద్మారమేష్, ఉపసర్పంచ్ ఉస్మాన్ గౌడ్ ఉన్నారు.

ఆల్ ఇండియా కిసాన్
సభకు బయలుదేరిన మండల నాయకులు

వీపనగండ్ల, నవంబర్ 16 (జనంసాక్షి): నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ బహిరంగ సభకు వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన ప్రజాసంఘాల నాయకులు బయలుదేరి వెళ్లారు.రైతు సంఘం జిల్లా నాయకులు నక్క ఈశ్వర్ మాట్లాడుతూ నవంబర్ 15,16,17 తేదీలలో నల్గొండ పట్టణంలో జరుగుతున్న ఆల్ ఇండియా కిసాన్ సంఘం మహాసభలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తూ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందించి ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచే విధంగా ఉద్యమాల కొనసాగిస్తామని అన్నారు.ఈ నెల 15న జరిగే బహిరంగ సభకు మాజీ పార్లమెంటు సభ్యురాలు హాజరై రైతు సమస్యలపై ప్రసంగిస్తారని, రైతులంతా భవిష్యత్తు ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం అవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యకాస మండల నాయకులు వెంకటయ్య, సిఐటియు నాయకులు ఆశన్న,వెంకటేష్ గౌడ్,సి.హెచ్ శ్రీనివాసులు,బత్తుల రాముడు, రామన్ గౌడు,నక్క ఆంజనేయులు,గౌడ సంఘం నాయకులు వెంకన్ గౌడ్,రైతు సంఘం నాయకులు డి.కృష్ణయ్య,తిరుపతయ్య, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దాసరిపల్లి సర్పంచ్ వెంకటేష్‌పై దాడి

- ఆసుపత్రిలో పరామర్శించిన సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తూమ్ కృష్ణారెడ్డి



మల్దకల్, నవంబర్ 15 (జనంసాక్షి):
మండల పరిధిలోని దాసరిపల్లి గ్రామ సర్పంచ్ బోయ వెంకటేష్‌పై అదే గ్రామానికి చెందిన మహేంద్రతో పాటు మరో ఏడుగురు దాడి చేసినట్లు బాధితుడు ఆరోపించారు. శనివారం రాత్రి 8 గంటల సమయంలో మల్దకల్ నుంచి స్వగ్రామమైన దాసరిపల్లికి బైక్‌పై వెళ్తుండగా దొరబాయి సమీపంలో పాత కక్షల నేపథ్యంలో తనపై దాడి చేసినట్లు వెంకటేష్ తెలిపారు. ఈ ఘటనపై మల్దకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీహరి వెల్లడించారు. దాడిలో గాయపడిన వెంకటేష్ గద్వాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మల్దకల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు తూమ్ కృష్ణారెడ్డి, దాసరిపల్లి మాజీ సర్పంచ్ భరత్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత సర్పంచ్‌కు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని వారు తెలిపారు.

జిల్లాస్థాయి కథల పోటీలలో శనిగరం విద్యార్థినికి ప్రథమ బహుమతి



కోహెడ, నవంబర్ 15 (జనంసాక్షి): సుగుణ సాహితీ సమితి సిద్దిపేట వారు నిర్వహించిన ఉగాది బాలల కథల పోటీలు 2026 లో మండలం లోని శనిగరం ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని బి.ప్రణతికి తాను రాసిన అమ్మ ప్రేమ అనే కథకు గాను జిల్లాస్థాయి ప్రథమ బహుమతి లభించింది. జిల్లా స్థాయిలో 473 మంది విద్యార్థులు కథల పోటీలలో పాల్గొనగా శనిగరం ఉన్నత పాఠశాల విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి రావటం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సరళ, తెలుగు భాషా ఉపాధ్యాయులు రచ్చ జగదీశ్వర్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించడం జరిగింది.

బొంతపల్లిలో భక్తజన సందోహం

- కార్తీక మాస ఆదివారం సందర్భంగా శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



గుమ్మడిదల, నవంబర్ 15 (జనంసాక్షి):
కార్తీక మాసం ఆదివారం సందర్భంగా బొంతపల్లిలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.
ఆలయానికి వచ్చిన భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నప్రసాదం అందించి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ కార్యక్రమాన్ని ఆలయ మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఆలయ పర్యవేక్షకులు సోమయ్య ఆధ్వర్యంలో పర్యవేక్షించారు. భక్తుల రాకతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించిన డీకే స్నిగ్ధారెడ్డి



గద్వాల ప్రతినిధి, నవంబర్ 15 (జనంసాక్షి): గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ మండల కేంద్రంలో శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమం నేడు అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఆలయ నిర్వాహకులు, వాల్మీకి సంఘం నాయకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.



అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించి, పూలమాల వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీకే స్నిగ్ధ రెడ్డి మాట్లాడుతూ, రామాయణ మహాకావ్యాన్ని రచించిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన బోధనలు, ఆశయాలు సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.
వాల్మీకి మహర్షి చూపిన సన్మార్గంలో ప్రతిఒక్కరూ నడుస్తూ సమాజంలో ఐక్యత, సోదరభావం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించాలని ఆకాంక్షించారు.
సామాజిక సమానత్వం కోసం మహర్షి చేసిన కృషి నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. వాల్మీకి ఆశయ సాధనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం స్థానిక ప్రజలు, వాల్మీకి కులస్తులు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విగ్రహావిష్కరణ వేడుకను విజయవంతం చేశారు. పండుగ వాతావరణంలో సాగిన ఈ వేడుకలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, గద్వాల అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థి శివారెడ్డి, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ధరూర్ కిష్టన్న, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, సర్పంచ్ రాజేష్ అయ్య, జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు మీర్జాపురం వెంకటేశ్వర రెడ్డి, వీరబాబు, రామిరెడ్డి, హన్మంత రాయ, యువరాజ్ శేఖర్ రెడ్డి, పాండు, మోహన్ రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో జరిగే సభకు వింజపల్లి గ్రామ ప్రజలు భారీగా తరలిరావాలి

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్



కోహెడ, నవంబర్ 15 (జనంసాక్షి): ఈ నెల 19వ తేదీన సిద్దిపేటలో జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు వింజపల్లి గ్రామం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరుతూ గ్రామ పార్టీ అధ్యక్షులు బద్దం రాజిరెడ్డి కి, వింజపల్లి సర్పంచ్ అన్నాడి శ్రీజ--జీవన్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు.
ఈ కార్యక్రమంలోనాయకులు కర్ర రవీందర్,దొమ్మాట జగన్ రెడ్డి, బండిపెల్లి నారాయణ, భీంరెడ్డి మల్లారెడ్డి , వింజపల్లి మాజీ సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి , వార్డు సభ్యులు అన్నాడి రాజేందర్ రెడ్డి , సీనియర్ నాయకులు గుర్రాల రాజేశ్వర్ రెడ్డి, గర్రెపల్లి రవీందర్ మంద ధర్మేందర్ , కొమ్ముల సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల వార్డు సభ్యుల ఫోరం ఏర్పాటు...



శివ్వంపేట, నవంబర్ 15 (జనంసాక్షి): నాగబెల్లి జ్యోతి ఆదేశాల మేరకు జిల్లా ఇంచార్జి గంతి అశోక్ యాదవ్ సమక్షంలో ఆదివారం నర్సాపూర్ నియోజకవర్గం ఇంచార్జి సత్తారం ప్రవీణ్ ఆధ్వర్యంలో శివ్వంపేట మండల వార్డు సభ్యుల ఫోరం కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు మండల వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షులుగా కావేటి యాదగిరి యాదవ్, మండల ఇంచార్జ్‌గా కొడకంచి స్వాతి గణేష్ గౌడ్, గౌరవ అధ్యక్షులుగా కల్లూరి సహదేవ్, ఉపాధ్యక్షులుగా పెద్దగోని శ్రీనివాస్ గౌడ్, శివన్నగారి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శులుగా రుబీనా బేగం, ఆనంద్ గుప్తా, జాయింట్ సెక్రెటరీగా మూణావత్ రమేష్, మన్యం గారి సంజీవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిహెచ్. విజయ నరేందర్, సోషల్ మీడియా కన్వీనర్ బుద్దుల భిక్షపతి, అధికార ప్రతినిధినింగా వనితలను ఎకాభిప్రాయంతో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బల్కంపేట కుమార్, ముత్యాలు, కొవ్వూరు యాదగిరి, సురేష్, రెడ్డిపల్లి అశోక్, పెద్దకోళ్ల విక్రం, కమలి గారి నర్సింలు వివిధ గ్రామాల వార్డ్ సభ్యులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

శంకరాయపల్లి తండాలో ఇందిరమ్మ గృహప్రవేశం



జడ్చర్ల, నవంబర్ 15 (జనంసాక్షి): జడ్చర్ల 9వ వార్డు శంకరాయపల్లి తండాలో చిట్యాల శారద – శీను దంపతుల నూతన ఇందిరమ్మ గృహప్రవేశం ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మాతృమూర్తి జనంపల్లి శశికళ రెడ్డి, మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహన్ హాజరై దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గోపాల్ నాయక్, కమలం శేఖర్, కిషన్ నాయక్, అంజాద్ ఖాన్, అల్తాఫ్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు రఘుగౌడ్, తుంగ రఘు, గ్రామస్తులు యాదయ్య, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌కు చెందిన పీఈటీ రాములుకు హ్యాట్రిక్ పతకాలు





కల్హేర్, నవంబర్ 15 (జనంసాక్షి): కల్హేర్ మండలం ఖానాపూర్‌కు చెందిన కృష్ణాపూర్ పాఠశాల పీఈటీ రాములు పటాన్చెరు మైత్రి మైదానంలో జరిగిన ఉమ్మడి జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో సత్తా చాటారు. 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. రాములును ఖానాపూర్, కృష్ణాపూర్ గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నూతన చేయూత పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాల అందజేత



చౌట్కూర్ , నవంబర్ 15 (జనంసాక్షి): ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అందోల్ నియోజకవర్గంలోని ఆందోల్, పుల్కల్, చౌటకూర్, వట్‌పల్లి మండలాలకు చెందిన నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమం సోమవారం సంగుపేటలోని లక్ష్మీదేవి గార్డెన్స్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు తదితరులకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి ప్రయోజనం చేకూరనుంది. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

నేడు ఉప్పునుంతల మండలంలో ఎమ్మెల్యే విస్తృత పర్యటన

- మహిళా సంఘాల భవనాలు, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు
- లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

ఉప్పునుంతల, (జనంసాక్షి): మండలంలో నేడు టీపీసీసీ ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెనిమిళ్ల, అయ్యవారిపల్లి గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు, ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించనున్నారు. అనంతరం మండల కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నారు.

ఎమ్మెల్యే పర్యటనకు సంబంధించిన వివరాలను ఉప్పునుంతల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్నె లక్ష్మీనారాయణ వెల్లడించారు.



ఎమ్మెల్యే పర్యటన వివరాలు...

ఉదయం 9:00 గంటలకు: పెనిమిళ్ల గ్రామంలో మహిళా సంఘాల భవనం, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం.

ఉదయం 9:30 గంటలకు: అయ్యవారిపల్లి గ్రామంలో మహిళా సంఘాల భవనం, ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమం.

ఉదయం 10:30 గంటలకు: ఉప్పునుంతల మండల కేంద్రంలోని కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో అన్ని గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు చేయూత సామాజిక భద్రత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమాలకు మండల ప్రజాప్రతినిధులు, అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, యువకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు, అధికారులు, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కర్నె లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు.

వైద్య విద్యకు గోలి శ్రీనివాస్ రెడ్డి చేయూత

- ఎంబీబీఎస్ విద్యార్థిని సౌమ్యకు రూ.25 వేల ఆర్థిక సాయం..
- మరో మూడేళ్ల పాటు స్టడీ మెటీరియల్ ఖర్చులు భరిస్తామని హామీ



కల్వకుర్తి, నవంబర్ 15 (జనంసాక్షి):
ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతిభతో వైద్య విద్యలో సీటు సాధించిన విద్యార్థినిని ప్రోత్సహిస్తూ తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అండగా నిలిచారు.కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామానికి చెందిన వాటం శ్రీశైలం కుమార్తె సౌమ్య ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందడంతో ఆమె చదువుకు అవసరమైన స్టడీ మెటీరియల్ కోసం రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింగం విజయ్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థిని కుటుంబ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు. అంతేకాకుండా రాబోయే మూడేళ్ల పాటు కూడా సౌమ్యకు అవసరమైన స్టడీ మెటీరియల్ ఖర్చులను భరిస్తామని గోలి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చినట్లు విజయ్ గౌడ్ తెలిపారు.

ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న సౌమ్య భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేష్ గౌడ్, రుక్సుద్దీన్, వీరాస్వామి, భానుచందర్, మాణిక్యం, పరమేష్, అశోక్,రవి తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే పల్లా



చేర్యాల, నవంబర్ 15 (జనంసాక్షి):
చేర్యాల మండలం తాడూర్ గ్రామానికి చెందిన ఈరు ఐలయ్య కుమార్తె జ్యోతి వివాహ వేడుక చేర్యాల పట్టణంలోని గుర్జకుంట క్రాస్ రోడ్డులో ఉన్న శ్రీ వరుణ్ వైష్ణ గార్డెన్స్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.

నాగసముద్రాల మోడల్ స్కూల్ వద్ద రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి: బీజేపీ



కోహెడ, నవంబర్ 15 (జనంసాక్షి): మండలంలోని నాగసముద్రాల తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల వద్ద ప్రతిపాదించిన నూతన రహదారి అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బీజేపీ కోహెడ మండల అధ్యక్షుడు జాలిగాం రమేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పాఠశాలను సందర్శించి రహదారి అలైన్‌మెంట్ వల్ల కలిగే నష్టాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ, ప్రతిపాదిత రహదారి నిర్మాణంతో పాఠశాల క్రీడా ప్రాంగణం రెండుగా విడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 700 నుంచి 800 మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాల సర్వే నంబర్ 263లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో కాంపౌండ్ వాల్‌తో నిర్మించబడిందని తెలిపారు.

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాఠశాలను స్వయంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. వివాదాస్పద అలైన్‌మెంట్‌ను నిలిపివేసి ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మ్యాకల చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సామల గిరిధర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంది సత్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్షుడు నాగు అజయ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం...

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి
- ముఖ్యవక్తగా సీనియర్ ప్రొఫెసర్ కె. స్టీవెన్సన్



జడ్చర్ల, నవంబర్ 15 (జనంసాక్షి): జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం జడ్చర్ల డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో నియోజకవర్గ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి సుల్తాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి, ముఖ్యవక్తగా ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ సీనియర్ ప్రొఫెసర్, సీనియర్ జర్నలిస్ట్ కె. స్టీవెన్సన్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా జర్నలిజం – విలువలు, బాధ్యతలు, ప్రస్తుత సమాజంలో పాత్ర మరియు పోకడలు అనే అంశంపై ముఖ్య వక్త ప్రొఫెసర్ కె.స్టీవెన్సన్ కీలక ప్రసంగం చేయనున్నారు. అనంతరం నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఘనంగా సన్మాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అందరూ సకాలంలో విచ్చేసి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కొల్చారం మండలానికి 548 నూతన పింఛన్లు మంజూరు

- 12 ఏళ్ల నిరీక్షణకు తెర.. నిరుపేదలకు భరోసా
- నేడు నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్‌లో..
- కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్



కొల్చారం, నవంబర్ 15(జనంసాక్షి): గత 12 ఏళ్లుగా నూతన పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుపేదలకు ఎట్టకేలకు ఊరట లభించింది. కొల్చారం మండలానికి 548 నూతన పింఛన్లను రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మంజూరు చేసినట్లు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ తెలిపారు.రాష్ట్ర మంత్రివర్గ సభ్యుల సహకారంతో పాటు మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక చొరవతో మండలానికి భారీ సంఖ్యలో నూతన పింఛన్లు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు. వితంతు పింఛన్లు 348, దివ్యాంగుల పింఛన్లు 99, ఒంటరి మహిళ పింఛన్లు 42, ఇతర కేటగిరిలో మహిళల పింఛన్లు 7, గీతా కార్మికుల పింఛన్లు 22 మొత్తము 548 నూతన పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్ లోమెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వాల హయాంలో పన్నెండేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న పేదలకు ప్రస్తుత ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచిందని మల్లేశం గౌడ్ అన్నారు. నిరుపేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి, మంత్రివర్గ సభ్యులకు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదలను ఆదుకోవడంలో ముందుండే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మండల ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని నాగులగారి మల్లేశం గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బిర్సా ముండా ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ఘనంగా భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలు



ఉప్పునుంతల, నవంబర్ 15 (జనంసాక్షి): ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలను ఆదివారం అచ్చంపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజు నివాసంలో బీజేపీ ఎస్టీ మోర్చా నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవీందర్ చౌహాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రవీందర్ చౌహాన్ మాట్లాడుతూ బిర్సా ముండా బ్రిటిష్ పాలకుల దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి పోరాడిన గొప్ప విప్లవ వీరుడని కొనియాడారు. ఆయన త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమన్నారు. నవంబర్ 15ను జనజాతీయ గౌరవ దివస్‌గా ప్రకటించడం గిరిజనుల చరిత్రకు లభించిన గుర్తింపుగా పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ ద్వారా గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర పథకాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని, బిర్సా ముండా ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొక్తల రేణయ్య, రాష్ట్ర నాయకులు మండికారి బాలాజీ, జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు, అఖిల్ రెడ్డి, రాకేష్ వర్మ, కాట్రావత్ జ్యోతి, శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా పానుగంటి కర్ణాకర్ ఎన్నిక

- నూతన మండల కమిటీ ప్రకటన.. నాయకుల అభినందనలు



ఉప్పునుంతల, (జనంసాక్షి): ఉప్పునుంతల మండలంలో భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా మండల కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా పానుగంటి కర్ణాకర్‌ను నియమిస్తూ పార్టీ నాయకులు పూర్తి మండల కమిటీని ప్రకటించారు.

నూతన మండల కమిటీ వివరాలు:

మండల అధ్యక్షుడు: పానుగంటి కర్ణాకర్

మండల ఉపాధ్యక్షులు: మద్దెలబండ కుమార్, పాతుకుల రాంప్రసాద్,

ప్రధాన కార్యదర్శులు: బొల్లె నాగరాజు, ఇంజమూరి తిరుపతి

కార్యదర్శులు: ఇంజమూరి బాలరాజు, పానుగంటి మధు, పానుగంటి అంజి

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ మాదిగ, బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పాతుకుల శేఖర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజు, దళిత మోర్చా అచ్చంపేట అధ్యక్షుడు గాలిముడి రాము తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్సీ వర్గాల అభ్యున్నతికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నూతన కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

- ఈ నెల 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు
- గ్రామ, మండల స్థాయిలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక శిబిరాలు

ఉప్పునుంతల, నవంబర్ 15 (జనంసాక్షి):
రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానుందని ఉప్పునుంతల ఎంపీడీవో వరుణ్ తేజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా బీమా పరిహారం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని వివరించారు.

18 నుంచి 59 ఏళ్ల వయస్సు వారికి అవకాశం..
ఈ పథకంలో కుటుంబాన్ని పోషించే 18 నుంచి 59 ఏళ్ల వయస్సు గల సభ్యుడిని బీమా పొందే వ్యక్తిగా





పరిగణించనున్నారు. వయస్సు ధ్రువీకరణకు ఆధార్ కార్డును ప్రాథమిక ఆధారంగా తీసుకోనున్నారు. అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా ప్రయోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ప్రత్యేక శిబిరాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ..
ఈ నెల 19వ తేదీ నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులైన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల ద్వారా ప్రజ లకు అవసరమైన సమాచారం, సహకారం అందించనున్నారు.

కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే ఈ సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వరుణ్ తేజ్ సూచించారు. ప్రజలు సంబంధిత అధికారులను సంప్రదించి పథకానికి సంబంధించిన వివరాలు తెలుసుకొని దర ఖాస్తు చేసుకోవాలని కోరారు.

దూల్మిట్ట మండల వార్డు మెంబర్ల ఫోరం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



చేర్యాల/దూల్మిట్ట, నవంబర్ 15(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ముక్క అనిల్, చేర్యాల మండల అధ్యక్షులు జూపల్లి కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం దూల్మిట్ట మండల వార్డు మెంబర్ల ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నాచగోని పూర్ణచందర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ఎనగందుల యాదగిరి, ప్రధాన కార్యదర్శులుగా నాగులపల్లి సంపత్, తాడెం రాజబాబు, సిరిగిరి భాగ్యలక్ష్మి, కనకయ్య.కార్యదర్శులుగా పేరం బాలరాజు, ఇస్లావత్ కీమా, జాటోతు రవి, దాసరి మనోజ్, గుండె అనూష కిరణ్, ధరావత్ జబ్బర్ లాల్, సలహాదారులుగా సిరిగిరి శ్రీనివాస్, తుషాలపురం బాలయ్య లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం, జిల్లా వార్డు మెంబర్ల ఫోరం తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి



చేర్యాల, నవంబర్ 15 (జనంసాక్షి): చేర్యాల పట్టణంలోని రేణుక గార్డెన్‌లో ఆదివారం జరిగిన వివాహ వేడుకకు కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. ఆకునూరు ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు మేడిచెల్మి అయోధ్య కుమారుడు కిషోర్, హరిణి (దీప) వివాహం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోయిని శ్రీనివాస్, మాజీ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంజ మల్లేశం, మారెళ్ల భాస్కర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ తదితర కాంగ్రెస్ నాయకులు, బంధువులు పాల్గొన్నారు.

బాలల సమస్యలపై ప్రత్యేక ప్రజావాణి.. ఫిర్యాదులకు ప్రత్యక్ష పరిష్కారం!

- సోమవారం ఐడీఓసీలో ప్రత్యేక కార్యక్రమం.. ఉదయం 10:30 గంటలకు నిర్వహణ

వనపర్తి నవంబర్ 15 (జనంసాక్షి):
బాలల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఈ నెల 16వ తేదీ సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో ప్రత్యేక బాలల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటలకు సాధారణ ప్రజావాణితో పాటు ప్రత్యేకంగా బాలల ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కుల ఉల్లంఘనలు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై హింస, నిర్లక్ష్యం, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించనున్నారు. బాధిత బాలలు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించారు. బాలల హక్కులకు భంగం కలిగించే ఘటనలు, వారి రక్షణకు సంబంధించిన సమస్యలపై ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి కోరారు. తల్లిదండ్రులు, సంరక్షకులు, ప్రజాప్రతినిధులు, బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రత్యేక బాలల ప్రజావాణిలో పాల్గొని ఫిర్యాదులు తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో ఉద్యోగ జాతర

- ఫాక్స్‌కాన్‌లో కొలువుల కోసం 1,000 మంది యువత పోటీ
- జాబ్‌మేళాను ప్రారంభించిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి యువతకు మంత్రి పిలుపు



చౌట్కూర్, నవంబర్ 15 (జనంసాక్షి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సుల్తాన్‌పూర్‌లోని జేఎన్టీయూ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫాక్స్‌కాన్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాఖూా ఏజెన్సీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ఉద్యోగ మేళాకు సుమారు వెయ్యి మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ఈ జాబ్‌మేళాను తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జేఎన్టీయూ ఆడిటోరియంలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఉద్యోగాల కోసం వచ్చిన యువతను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్హతలతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను కూడా అభివృద్ధి చేసుకోవడం ఎంతో అవసరమని సూచించారు. పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల అవసరాలకు అనుగుణంగా యువత తమ



నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు.


ఫాక్స్‌కాన్ వంటి ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళా నిరుద్యోగ యువతకు మంచి అవకాశమని మంత్రి అన్నారు. ఇలాంటి ఉపాధి కార్యక్రమాల ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు చేరువవుతాయని, వారి ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని వివరించారు.

జాబ్‌మేళా విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన రాఖూా ఏజెన్సీ ప్రతినిధులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. పెద్ద సంఖ్యలో యువత పాల్గొనడంతో జేఎన్టీయూ ప్రాంగణంలో ఉద్యోగ సందడి నెలకొంది.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోడపట్ల గణేష్ ముదిరాజ్, సంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నందికంటి రామచంద్ర, సర్పంచులు మల్లారెడ్డి, రాజశేఖర్, గీతా రమేష్, ఉపసర్పంచ్ మహేష్ యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గొల్ల మల్లేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

ఫాక్స్‌కాన్ కొలువుల కోసం యువత క్యూ

- ఫాక్స్‌కాన్ ఉద్యోగాల కోసం 1,000 మంది యువత పోటీ
- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 15 (జనంసాక్షి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఉద్యోగ మేళాను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగ అవకాశాల కల్పన కోసం ఎస్‌కేఎస్ఎస్ సంస్థ సహకారంతో ఈ మేళాను నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అంతర్జాతీయ స్థాయి సంస్థలు ముందుకు వస్తున్నాయని, ఆయా సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మేళా నిర్వహణకు సహకరించిన ఎస్‌కేఎస్ఎస్ సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

మల్దకల్ సింగల్ విండో చైర్మన్ బీసీలకు ఇవ్వాలి...

• ఎమ్మెల్యే పై ఆశలు పెట్టుకున్న బీసీ నేతలు

మల్దకల్, నవంబర్ 15 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల సింగిల్ విండో చైర్మన్ నామినేటెడ్ పదవి బీసీలకు కేటాయించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలోని అత్యధికంగా బీసీ సామాజిక వర్గానికి చెందినవారు ఉండడంతో ఇక్కడ స్థానాన్ని బీసీలకు సామాజిక వర్గమైన (వాల్మీకి) ఇవ్వాలని, సింగిల్ విండో ఏర్పడిన నుండి ఇప్పటి వరకు ఎస్సీలకు, బీసీలకు మాత్రమే ఇవ్వలేదని సామాజిక వర్గం ప్రజలు అంటున్నారు.

ఇప్పటివరకు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మల్లెం దొడ్డి రామిరెడ్డి, మల్దకల్ కేశవరెడ్డి, ఎల్కూర్ యుగంధర్ రెడ్డి, మల్లెందొడ్డి మాణిక్య రెడ్డి, నాగర్ దొడ్డి విక్రమ్ సింహారెడ్డి, ప్రస్తుతం శేషంపల్లి తిమ్మారెడ్డి పదవిలో కొనసాగుతున్నారు. గతంలో మండలంలోని రెండు సింగల్ విండో సొసైటీలు ఉన్నాయి బూడిదిపాడు సింగిల్ విండో సొసైటీకి అప్పట్లో సింగిల్ విండో చైర్మన్‌గా సీతారామరెడ్డి, బూడిదపాడు వెంకట్ రాజారెడ్డి కొనసాగారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు మండలానికి ఒకే సోసైటీ ఉండాలని మల్దకల్ మండలాన్ని సింగల్ విండో సొసైటీగా ఏర్పాటు చేశారు. అప్పటినుండి ఇప్పటివరకు రెడ్డి సామాజిక వర్గం చెందిన నాయకులే సింగిల్ విండో చైర్మన్‌గా కొనసాగుతూ వచ్చారు. కాబట్టి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి బీసీలపై కనికరించి బీసీ నాయకులని సింగల్ విండో చైర్మన్‌గా నియమించాలని బీసీ కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. ఇప్పటికే పక్క నియోజకవర్గమైన అలంపూర్ నియోజకవర్గంలోని ఏడు సింగల్ విండో చైర్మన్ స్థానాలను ప్రకటించి ప్రమాణస్వీకారం కూడా పూర్తి చేసుకున్నారు.

ఆ నియోజకవర్గంలోని సామాజిక వర్గానికి చెందిన నాయకులకే సింగల్ విండో చైర్మన్‌లను నియోజకవర్గ ఇన్చార్జి సంపత్ కుమార్ సమానంగా నియమించారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం సింగిల్ విండో చైర్మన్‌లను నామినేటెడ్‌గా ఇవ్వాలని గతంలో క్యాబినెట్లో తీర్మానం చేయడం జరిగింది. దాని ప్రకారం నియోజకవర్గంలో మండల కేంద్రాలలో బీసీ సామాజిక వర్గానికి, లేదా ఎస్సి సామాజిక వర్గాలకి ఇవ్వాలని నియోజకవర్గ బీసీ, ఎస్సీ నాయకులు కోరుతూ వారికి సమాన నాయం చేకూరుస్తారని ఎమ్మెల్యేపై పూర్తిస్థాయి నమకం ఉందని బీసీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు.



గ్రీన్ రన్ ఫెస్ట్‌లో జడ్చర్ల రన్నర్ల సత్తా

జడ్చర్ల, నవంబర్ 15 (జనంసాక్షి):
చేగూర్‌లోని కన్హా శాంతివనంలో ఆదివారం నిర్వహించిన గ్రీన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ రన్ ఫెస్ట్–2026 5వ ఎడిషన్ ఉత్సాహభరితంగా ముగిసింది.

వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2 వేల మంది పాల్గొన్న ఈ పోటీల్లో (1కే, 5కే, 10కే, 21కే) జడ్చర్ల రన్నర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. యువకులతో పాటు వృద్ధులు సైతం వయసును లెక్కచేయకుండా పరుగెత్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 21 కిలోమీటర్ల విభాగంలో రన్నర్లు 2 గంటల 45 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నారు. విజేతలకు రామకృష్ణ, గోపాల్ మెడల్స్ అందజేసి అభినందించారు.

కథల పోటీలో విద్యార్థిని భవిష్యకు తృతీయ స్థానం



చేర్యాల, నవంబర్ 15 (జనంసాక్షి): సుగుణ సాహితీ సమితి నిర్వహించిన జిల్లా స్థాయి కథల పోటీలో అర్జునపట్ల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని జి. భవిష్య తృతీయ స్థానం సాధించి నగదు బహుమతికి ఎంపికైంది. జిల్లా వ్యాప్తంగా వచ్చిన 470 కథల్లో ఆమె రాసిన 'ఎప్పుడు' కథ ఉత్తమ ప్రతిభా పురస్కారానికి ఎంపికైంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ సాహిత్య రంగంలో రాణిస్తున్న భవిష్యను గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుడు రామచంద్రమూర్తిని పలువురు కొనియాడారు.

జేబీఎన్ టీమ్‌లో 50 మంది చేరిక

జడ్చర్ల, నవంబర్ 15 (జనంసాక్షి): జడ్చర్ల మండలం పెద్ద రేవల్లి గ్రామంలో ఆదివారం జరుపుల భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు జేబీఎన్ టీమ్‌లో చేరారు. అనంతరం జడ్చర్ల పెద్దగుట్ట వెనుక ఉన్న దర్గాను భాస్కర్ నాయక్, సభ్యులు సందర్శించి, అక్కడ మౌలిక వసతుల కల్పన కోసం రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జరుపుల భాస్కర్ నాయక్ మాట్లాడుతూ యువత సమాజ సేవలో ముందుండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

నేటీ మంత్రి పర్యటనను విజయవంతం చేయండి



శివ్వంపేట, నవంబర్ 15 (జనంసాక్షి): ఈనెల 16న నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణానికి రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి రానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ్వంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అలాగే మహిళ నాయకురాళ్లు, కార్యకర్తలు, లబ్దిదారులు, సోమవారం ఉదయం 10 గంటలకు నర్సాపూర్ లోని సాయి కృష్ణ గార్డెన్ లో జరిగే వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ పెన్షన్ల పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరవుతున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి సకాలంలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నవీన్ గుప్తా కోరారు.

గ్రామస్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని పటిష్టం చేయాలి..

• కేంద్ర ప్రభుత్వ ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ది తీసుకెళ్లాలి

• బిజెపి మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి

గండీడ్, నవంబర్ 15 (జనంసాక్షి): గండీడ్ మండలంలోని ప్రతి గ్రామంలో భారతీయ జనతా పార్టీని,క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నూతన మండల కార్యవర్గ సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలు,ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని,గ్రామస్థాయి నుంచి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన మండల కార్యవర్గ వివరాలను వెల్లడించారు.మండల ఉపాధ్యక్షులుగా కావలి నర్సింహులు,సంతెం వెంకటేష్,చాకలి బాలయ్య, ఎం.గణేష్ గౌడ్,ప్రధాన కార్యదర్శులుగా భద్రేశ్వర్,ఛత్రపతి శ్రీనివాస్,కార్యదర్శులుగా కాకి నరేష్, పి.వెంకట్ రెడ్డి, బంటు కృష్ణ, కమ్మరి నర్సింలు, అముక కృష్ణ,మోత్కు సునీత రామిరెడ్డి, కోశాధికారిగా పల్లవత్ సంతోష్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రాజేశ్వరి, యువ మోర్చా అధ్యక్షుడిగా పుల్లారి నవీన్ యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా అన్నారం కిష్టారెడ్డి, ఎస్సీమోర్చా అధ్యక్షుడిగా దొడ్య రాములు నియమితులయ్యారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత



మాగనూర్, (జనంసాక్షి): ఆదివారం రోజున మధ్యాహ్నం 03:30 గంటల సమయంలో మాగనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గజరందొడ్డి వాగు వద్ద పోలీసులు పెట్రోలింగ్ (112 డయల్ డ్యూటీ) నిర్వహిస్తుండగా, అక్రమంగా ఇసుక లోడుతో ఉన్న ఒక ట్రాక్టర్‌ను గుర్తించారు. పోలీసులను గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ భయంతో అక్కడే ఇసుకను అన్‌లోడ్ చేశాడు. తనిఖీ చేయగా, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా దొంగతనంగా ఇసుక తరలిస్తున్నట్లు నిర్ధారణ అయింది. సదరు ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు.

సీఎం సిద్దిపేట సభను విజయవంతం చేయాలి



నంగునూరు, (జనంసాక్షి): ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 19న సిద్దిపేటలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన నున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నంగునూరు ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ పిలుపునిచ్చారు.

ఈ సభ వేదికగా సీఎం రాష్ట్రవ్యాప్తంగా 'ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం', 'ఇందిరమ్మ చీరల పంపిణీ' కార్యక్రమాలను ప్రారంభించనున్నారని తెలిపారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న ఈ సభకు నంగునూరు మండల కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజ్ బహుదూర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ రంగు అశోక్, ఏఎంసీ, పాక్స్ డైరెక్టర్లు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా...

• మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల బీమా పరిహారం అందజేత

• ప్రతి కుటుంబం బీమా రక్షణ పొందాలి: బ్యాంకు అధికారులు



కల్వకుర్తి, నవంబర్ 15 (జనంసాక్షి): బీమా పథకాలు ఆపద సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని, ప్రతి ఒక్కరూ బీమాపై అవగాహన పెంచుకొని వాటిలో చేరాలని బ్యాంకు అధికారులు సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం కోరిటికల్ గ్రామానికి చెందిన వాకిటి రమేష్ ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల బీమా పరిహారం మంజూరైంది. మృతుడి నామినీ వాకిటి గీతకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు వెల్టూర్ శాఖ అధికారులు బీమా క్లెయిమ్ చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న బీమా పథకాల్లో ప్రతి ఒక్కరూ చేరాలని సూచించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో బీమా పరిహారం కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఒడ్డే రాధికకు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



ఉర్కొండ, నవంబర్ 15 (జనంసాక్షి); ఉర్కొండ మండలంలోని తిమ్మన్నాపల్లి గ్రామానికి చెందిన ఒడ్డే రాధికకి రూ.60,000/- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేయడం జరిగింది. బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి సూచనతో పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణ సహకారంతో ఈ చెక్ మంజూరు అయింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.రాజేందర్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు శివ ఆధ్వర్యంలో ఈ చెక్‌ను అందజేశారు.

ఈ సందర్భంగా రాధిక కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పరుశరామ్ మరియు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పేదల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

- లబ్ధిదారులకు చెక్కులు, ఎల్ఓసీ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి

కల్వకుర్తి, నవంబర్ 15(జనంసాక్షి): కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు,వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన అనుమతి పత్రాలను అందజేశారు.ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు.అనంతరం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు.తమ కుటుంబాల్లో నిర్వహించనున్న వివాహ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు. ఎమ్మెల్యేనుకలిసినవారిలో వివిధమండలాలకు చెందిన నాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

కులమత బేధం లేకుండా అందరి సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం..

- పఠాన్‌చెరు ఛట్ పూజలో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్

పటాన్చెరు నవంబర్ 15 (జనంసాక్షి):
కులమత బేధం లేకుండా అందరూ సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు అన్నారు. ఆదివారం పటాన్చెరు సాకి చెరువు వద్ద నిర్వహించిన చట్ పూజ వేడుకల్లో ఆయన పాల్గొని ఉత్తర ప్రాంత ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ హయాంలో పటాన్‌చెరు ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడంతో దేశంలోని వివిధ



ప్రాంతాలకు చెందిన ఎంతోమందికి ఇక్కడ ఉపాధి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. ఉపాధి కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు పటాన్‌చెరును తమ సొంత ప్రాంతంగా భావిస్తూ ఇక్కడే స్థిరపడ్డారని అన్నారు. వారి కష్టం, శ్రమతోనే నేడు పటాన్‌చెరు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేస్తుందని కొనియాడారు. ఛట్ పూజ సందర్భంగా ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ సూర్యభగవానుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసి జిల్లా అధ్యక్షులు, పటాన్ చెరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొల్కూరి నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ ఫోటోకాల్ చైర్మన్ పట్లోళ్ల ఆదిత్య రెడ్డి, జలగరి ఎట్టయ్య, నిర్వాహకులు మున్నా యాదవ్, కిషన్, నేతాజీ, బలం సింగ్, షారుక్, లాలన్, ప్రమోద్, వికాస్, గౌతమ్, సాగర్, నాయకులు రవి, వెంకటేష్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



10+2 విధానంపై భిన్న స్పందనలు.. క్షేత్రస్థాయి పరిశీలన ముఖ్యం

- డ్రా.పాట్లు తగ్గుతాయన్న ఎంఈఓ, ఉపాధ్యాయులు • వసతులు లేకుంటే ఆచరణలో ఇబ్బందులు తప్పవని సూచన • అందరి అభిప్రాయాలు తీసుకుని అమలు చేయాలని విజ్ఞప్తి

జడ్చర్ల, నవంబర్ 15 (జనంసాక్షి):
రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న నూతన టెన్ ప్లస్ టూ (10+2) విద్యా విధానంపై జడ్చర్ల మండలంలో ఉపాధ్యాయ వర్గాలు, విద్యాధికారుల నుంచి భిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్ విద్య అందుబాటులోకి రావడం, పదో తరగతి తర్వాత డ్రా పౌట్లు తగ్గడం వంటి సానుకూలాంశాలను స్వాగతిస్తూనే, క్షేత్రస్థాయిలో మౌలిక వసతులు, నిధులు, సిబ్బంది కొరత వంటి సవాళ్లను వారు ప్రస్తావిస్తున్నారు. ఈ విధానంపై విద్యాధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల, ఉపాధ్యాయుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

డ్రా పౌట్లు తగ్గి.. బాలకార్మిక వ్యవస్థకు అడ్డుకట్ట...



10+2 విద్యా విధానం చాలా బాగుంటుంది. దేశంలో ఇప్పటికే 19 రాష్ట్రాలు దీనిని అమలు చేస్తున్నాయి. మన రాష్ట్రంలోనూ అమలు చేయడం వల్ల పదో తరగతి తర్వాత చదువు ఆపేసి బాలకార్మికులుగా మారకుండా, నేరుగా 11వ తరగతిలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. ప్రీ- ప్రైమరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలల్లో, 5 నుంచి 8 వరకు ఉన్నత పాఠశాలల్లో బోధన సాగుతుంది. మండలానికి రెండు మూడు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేసి, సమీప విద్యార్థులకు రవాణా వసతి కల్పించాలి. దీనికి తగిన తరగతి గదులు, ఉపాధ్యాయుల సర్దుబాటు వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చితే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

– కే.జగదీష్ కుమార్, మండల విద్యాధికారి (ఎంఈఓ), జడ్చర్ల..

అందరి అభిప్రాయాలు తీసుకుని అమలు చేయాలి...




ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి 10+2 విధానం అమలు చేయాలనే ఆలోచనను పరిశీలించాలి.
విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రణాళిక రూపొందించాలి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల నియామకాలు, ప్రయోగశాలలు, తరగతి గదులు కల్పించాలి. ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకున్నాకే అమలు చేయాలి. విద్యార్థులపై భారం పడకుండా ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా విధానం ఉండాలి.

– తాహెర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్...







క్షేత్రస్థాయిలో వసతులు ముఖ్యం

టెన్ ప్లస్ టు విధానంలో నర్సరీ నుండి 4వ తరగతి వరకు ప్రాథమిక, 5 నుండి 8 వరకు మాధ్యమిక, 9 నుండి 12వ తరగతి వరకు ఉన్నత విద్య అనే ఆలోచన బాగున్నప్పటికీ, నిధుల కేటాయింపు, సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలి. సరైన ప్రణాళిక, బోధన, బోధనేతర సిబ్బంది నియామకం, ప్రయోగశాలలు, వసతులు, పర్యవేక్షణ ఉన్నప్పుడే సత్ఫలితాలు వస్తాయి. క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసి అమలు చేస్తేనే ఆశించిన ఫలితాలు ఉంటాయి.

– కే. మల్లస్వామి, ఎస్.ఏ (తెలుగు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగాపూర్..

సమగ్ర ప్రణాళికతోనే విధానం సఫలం

ఏ ప్రభుత్వ విధానమైనా విజయవంతం కావాలంటే కేవలం కాగితాలపై ప్రణాళికలు సరిపోవు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను అంచనా వేసి, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు మరియు తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముందడుగు వేస్తేనే గ్రామీణ విద్యార్థులకు నిజమైన ప్రయోజనం చేకూరుతుంది.

